అమ్మాయిల బందిఖానా

బి. రాజేశ్వరి

"ఈ రాత్రికి యీ రహదారి బంగళాలో మన మొదటి మజిలీ. ఉదయం తిరిగి ఏడుగంటలకల్లా బయిల్దేరితే కేదారకోన పన్నెండు గంటలకు చేరుకోగలుగుతాం" అన్నది కౌసల్య. ఆమె బోటనీ లెక్చరర్.

అమ్మాయిలందరు బుద్ధిగా తలలూపారు.

ఉస్మానియా ఉమెన్స్ కాలేజి బొటానికల్ టూర్ కోసం ఫైనలియ్యర్ బి.ఎస్సి. స్టూడెంట్సు కేదారకోనకు ఫీల్డు విజిట్ కు బయల్దేరారు కౌసల్య సారధ్యంలో. కాలేజి మొత్తంమీద కౌసల్య సీనియర్ కావటమే కాక బొటనీ హెడ్.

మొత్తం అమ్మాయిలు ముప్పయి యిద్దరున్నారు. కౌసల్యకాక, మరో యిద్దరు లెక్చరర్సు—హేమలత, జమునాబాయి వెంట వచ్చారు. అకౌంటెంటు పరంధామయ్య, యిద్దరు అటెండర్లు, బస్ డ్రైవరు, క్లీనరు వాళ్ళతోబాటు వున్న తక్కిన సిబ్బంది.

ఉదయం పదిగంటలకు యూనివర్సిటీ కాలేజినుంచి బయల్దేరిన బస్ రాత్రి ఏడుగంటలకు సింహపురి చేరింది. ముందుగానే సింహపురి రహదారి బంగళాలో ఓ రాత్రి విశ్రమించటానికి అధికారులనుండి అనుమతి తీసుకున్నది కౌసల్య.

వాళ్ళు సింహపురి బంగళా చేరేసరికి బహుశా వాచ్‌మన్, యిద్దరు అటెండర్లు వాళ్ళని రిసీవ్ చేసుకోటానికి సిద్ధంగా వున్నారు.

"మీలో వంట బాగా తెలిసినవాళ్ళు ముందుకురండి. ఓ గంటలో అందరికీ భోజనాలు సిద్ధం చేయాలి!" అన్నది కౌసల్య.

ముప్పయి యిద్దరు అమ్మాయిల్లో నలుగురు మాత్రం వంట చేయటానికి సిద్ధమయ్యారు.

"అరె, తక్కిన వాళ్ళెవరికీ వంట చేయటం చేతకాదా ఏం? చదువుకొంటున్నంత మాత్రాన వంట గది ముఖం చూడకూడదనే నియమం యేదీ లేదే!" హేమలత ఛలోక్తిగా అన్నది.

అమ్మాయిలు సిగ్గుపడ్డారు.

తమ వెంట తెచ్చిన వంటసామగ్రిని, సరకుల్ని బయటికి తీశారు. వంట కార్యక్రమం ప్రారంభించారు.

అందరు తమకు చేతనైన పనిచేసి, వంట తొందరగా పూర్తికావటానికి సహాయపడ్డారు.

సింహపురి రహదారి బంగళా విశాలంగా వుంది. బంగళాకి చుట్టు చక్కటి తోటకూడా పెంచటాన్నిబట్టి, అక్కడి అధికారుల అభిరుచికి చక్కటి నిదర్శనం!

పచ్చ పువ్వులాంటి వెన్నెల బంగళామీద, పరిసరాల్లోనూ పిండారబోసినట్టు పరుచుకుని వుంది.

భోజనాలయ్యాక అందరు కాసేపు వెన్నెల విహారం చేశారు.

కౌసల్య అమ్మాయిలచేత పాటలు పాడించింది. కొందరు కవితలు అశువుగా చెప్పారు. మధ్య మధ్య హేమలత ఛలోక్తులు విసురుతూ వాతావరణాన్ని మరింత అహ్లాదకరంగా చేస్తూ వచ్చింది. జమునాబాయి చిరునవ్వుతో అందర్నీ చూస్తూ వింటోంది. ఆమె స్వతహా రిజర్వుడుగా వుండే వ్యక్తి.

రాత్రి తొమ్మిదిన్నరకు అందరు విశాలమైన హాల్లో తమవెంట తెచ్చుకున్న కేంప్ కాట్స్ పరుచుకుని నిద్ర కుపక్రమించారు.

అకౌంటెంటు రామచంద్ర, అటెండర్లు, బస్ డ్రయివర్ యాదగిరి, బంగళా వాచ్ మన్ తక్కిన అటెండర్లు బంగళా ముందు వరండాలో పక్కలు పరుచుకున్నారు. క్లీనరు బస్సులోనే పడుకున్నాడు.

"ఉదయం ఆరుగంటలకే అందరు లేచి సిద్ధంగా వుండాలి" అన్నది కౌసల్య అందరితోను.

2

ఉదయం స్నానాదికాలు ముగించుకుని, టిఫిన్ చేసుకు తిని, సరంజామా అంతా సర్దుకుని బస్ లో పెట్టుకున్నారు.

కౌసల్య అందర్నీ హడావిడి పెట్టి బయల్దేరతీసింది. ఆడవాళ్ళ అలంకరణ గురించి ఆమెకు బాగా తెలుసు. గంటలతరబడి ముస్తాబు చేసుకోవటానికే వున్న సమయం వ్యర్థంచేసే అమ్మాయిలు కౌసల్య మాట అల్లంతదూరంలో వినపడగానే చటుక్కున తెమిలి బస్ వంక పరుగులు పెట్టారు.

బంగళా వాచ్ మన్, అటెండర్లు వాళ్ళకు గౌరవ

పురస్సరంగా వాళ్ళకు వీడ్కోలిచ్చారు.

అందరిలోను ఉత్సాహం వెల్లివిరుస్తోంది. కొద్ది గంటల్లో కేదారకోన చేరుకుంటున్నామన్న ఆనందం వాళ్ళను టెన్షన్‌కి గురిచేస్తోంది.

బస్ బయల్దేరిన ఓ గంట వరకు ప్రయాణం బాగానే జరిగింది.

ఉన్నట్టుండి బస్ సడన్‌గా ఆగిపోయింది.

అందరు ఊహాలోకాల నుంచి వాస్తవానికొచ్చారు. అంతవరకు సరదాగా కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళ మాటలు ఆపేసి రోడ్ వైపు దృష్టి సారించారు.

ముందుగా కౌసల్య మాట్లాడింది.

"ఏమి యాదగిరీ, బస్ ఆపేశావు?" అన్నది.

యాదగిరి బోనెట్ ఎత్తి కొక్కెం తగిలిస్తూ, "ఇంజన్‌లో ఏదో తేడా వచ్చినట్టుందమ్మా. చప్పుడవుతోంది!" అన్నాడు.

అందరు ఉస్సూరంటూ చూశారు అతని వంక.

యాదగిరి ఇంజన్ కాసేపు రిపేరు చేసి, యింజన్ స్టార్టు చేశాడు. బర్రుమంటూ పూరకే చప్పుడయిందేగాని స్టార్టు కాలేదు.

బస్ దిగి, ఆయిల్ టాంక్ టెస్టు చేసుకున్నాడు. ఆయిల్ సరిపడా వుందని నిర్ధారణ చేసుకున్నాడు. బస్ కింద దూరి ఓ పది నిమిషాలు పరీక్షించి బయటికొచ్చాడు క్లీనర్ కుర్రాడు.

"అంతా బానే వుంది గురూగారూ!" అన్నాడు వాడు యాదగిరితో.

యాదగిరి తలాపి, మళ్ళీ బస్ ఎక్కాడు.

స్టార్టు చేశాడు. కాని స్టార్టు కాలేదు.

అందరికీ నిరాశగానే వుంది.

కౌసల్య టెన్షన్ ఫీలవుతోంది. ప్రయాణం తెమ లటంలేదు. వచ్చేముందు సర్వీసింగ్ కి యిచ్చిన కాలేజి బస్ ట్రబులివ్వటం ఆమెకు అమితాశ్చర్యాన్ని కలిగించింది. అదే అడిగింది యాదగిరిని.

"ఇంజన్ ట్రబులిస్తుందని ముందుగా తెలీదా? సర్వీసింగ్ టైంలో దగ్గర లేవన్నమాట!" అన్నది.

యాదగిరి కంగారుపడి, "అదేం కాదమ్మా, నేను దగ్గరే వున్నాను.... నా అనుమానం, రాత్రి మనం బంగళాలో పడుకుని వున్న సమయంలో బస్‌ను యెవరో కావాలని పాడుచేశారని! నా అనుమానానికి ఆధారా లేకపోలేదు. ఇంజన్ లోపల యెవరో కెలికినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. స్పీడ్ మీటర్ దగ్గర కనెక్టెడ్ వైర్ను కూడా రాంగ్ డైరెక్షన్ కలిపి, బండి న్యూట్రల్ లో పెట్టడానికి వీల్లేకుండా చేశారు. ఇదంతా కావాలని చేసినపని!" అన్నాడు.

కౌసల్యతోపాటు అందరు విస్తుపోయి చూశారు.

"రాత్రి నువ్వు బస్‌లో పడుకోలేదా?" అడిగింది కోపంగా కౌసల్య.

"క్లీనరు బస్‌లో నే పడుకున్నాడమ్మగారూ! కాని, యెందుకో తెలీదుగాని ముద్దు నిద్రపోయాడు. తెల్లారి నేను తట్టి లేపేవరకు లేవలేకపోయాడు!"

ఓ గంట తర్వాత రిపేర్లు పూర్తిచేశాడు యాదగిరి. క్లీనర్, అటెండర్లు అతనికి సహాయపడ్డారు.

కౌసల్య తీవ్రంగా ఆలోచిస్తోంది. హేమలత, జమునా బాయికూడా ఆలోచనల్లో పడ్డారు. తమ బస్‌ను పాడు చెయ్యాల్సిన అవసరం ఎవరికుంది? ఎందుకు పాడుచేశారు?

తమకి ఏదయినా అపకారం తలపెట్టాలనే ఉద్దేశంతో కాదుగదా!

తనవంక సాభిప్రాయంగా చూసిన వాళ్ళిద్దర్నీ ఉద్దేశించి, కౌసల్య, "యాదగిరి ఏదో పొరబడుతున్నాడు. మన బస్‌ని కావాలని యెవరు పాడుచేస్తారు? అలా చెయ్యటంవల్ల వాళ్ళకొచ్చే ప్రయోజనమేమిటి? లేనిపోని అనుమానాలు పెట్టుకోవటం అనవసరం!" అన్నది.

అమ్మాయిలు ఆ విషయానికంత ప్రాధాన్యత నివ్వలేదు. ఎవరి మట్టుకు వాళ్ళు ఏవో విషయాలు చర్చించుకుంటూ కాసేపట్లోనే ఆ సంగతి మరిచిపోయారు.

బస్ బయల్దేరింది. నిర్ణీత గమ్యం చేరేవరకు మళ్ళీ యెలాంటి ట్రబుల్ రాలేదు.

3

కేదారకోన సుందరమైన లోయలతోను, ప్రకృతి దృశ్యాలతోను, చెట్టు చేమలతోను చూపరుల దృష్టిని ఆకట్టుకుని కట్టిపడేస్తుంది. అప్పుడప్పుడు అక్కడికి యాత్రికులు వినోదార్థం రావటం కూడా కద్దు. అయితే అది వేసవికాలంలోనే తక్కిన సీజన్‌లలో అక్కడికి రావటానికి ఎవరూ ఇష్టపడరు. ముఖ్యంగా చలికాలం అయితే రక్తం గడ్డకట్టించేటంత చల్లగా వుంటుందక్కడ. వర్షాకాలం దార్లు సరిగ్గా వుండవని, అక్కడ జారుడుగా వుంటుందనీ, నీరు చుట్టూ చేరి అంతా చిత్తడిగా వుంటుందని__రావటానికి సంకోచిస్తుంటారు. వేసవికాలం ఒక్కటే కేదారకోనకు రావటానికి సరైన అదను.

కౌసల్య అందుకనే మార్చి నెల మొదట్లో ఈ టూర్ ఫిక్స్ చేసింది. అప్పటికింకా చలి పూర్తిగా పోలేదు.

ఎండలు ఇంకా ముదరలేదు. కేదారకోన కొండలమీద బాగా చలిగా వుంది.

అసలు కేదారకోనకే టూర్ వేసుకోవటానికి ముఖ్య కారణం లేకపోలేదు. కేదార కోనలో వున్నన్ని వృక్ష జాతులు, వివిధ రకాల మొక్కలు, ఫలపుష్ప వృక్ష సముదాయాలు మరెక్కడా లేవు. బోటనీ స్టూడెంట్స్‌కి కేదారకోన ఓ వరప్రసాదం! అక్కడ వాళ్ళకు ఉప యోగపడే ఎన్నో రకాల బొటానికల్ స్పెసిమెన్స్ వుండటమే అందుకు కారణం!

కౌసల్య స్టూడెంట్సందరికీ స్పాట్ చూపించి, వివిధ రకాల మొక్కలను, వాటి ప్రాముఖ్యతను క్లుప్తంగా చెప్పి, "మీరు రేపట్నుంచి వారంరోజులపాటు ఇక్కడే మొక్కలను, వాటి బొటానికల్ టరమ్స్‌ను బాగా స్టడీ చెయ్యండి! మీ అబ్జర్వేషన్స్ ఫీల్డు నోట్ బుక్‌లో వివ రంగా నోట్ చెయ్యండి. మీకు ప్రతిక్షణం సలహా సహా యాలు అందచేసేందుకు నేను, హేమలతా మేడమ్, జమునాబాయి మేడం సిద్ధంగా వుంటాం!" అన్నది.

ఆడపిల్లలందరూ తలలూపారు.

"ఇప్పుడు యిక మన బసకు చేరుకుని మళ్ళీ రేపుదయం వద్దాం!" అన్నది కౌసల్య.

ఈలోపల యాదగిరి వచ్చాడు. అతను కేదారకోనకు వస్తూనే అందర్నీ దింపి, అక్కడకు అయిదు కిలోమీటర్ల మార్గంలో వున్న పల్లెటూరు రామవరం వెళ్ళివచ్చాడు. అక్కడ పంచాయితీ ఆఫీసు వాళ్ళకు బసకోసమని కేటా యించారు అక్కడి సర్పంచ్ రంగనాథరావు.

రంగనాథరావు కుమార్తె కౌసల్యకు ఓల్డు స్టూడెంటు. వాళ్ళ కాలేజిలోనే బి. ఎస్సి. పాసయింది. ఆ పరి

చయంలోనే రంగనాథరావు తమ రామవరంలో కౌసల్య బృందానికి చక్కటి వసతి సదుపాయాలను ఏర్పరిచాడు.

"సర్పంచ్ గార్ని కలిసి వచ్చానండమ్మా! మనకి కావలసిన ఏర్పాట్లన్నీ చేశారు అయ్యగారు" అన్నాడు యాదగిరి.

బస్ యిరవై నిమిషాల తర్వాత రామవరంలో వుంది. రంగనాథరావే స్వయంగా వచ్చి రిసీవ్ చేసుకున్నాడు. వాళ్ళకి మిత్రం పంచాయితీ ఆఫీసునంతా కేటాయించారు.

కౌసల్య రంగనాథరావుతో ముందే చెప్పేసింది.

"మేం యిక్కడ వుండే వారంరోజులు మా భోజన ఏర్పాట్లు మేమే చూసుకుంటాం. అందుకు మీరు అభ్యంతర పెట్టకూడదు!" అని.

రంగనాథరావు నొచ్చుకుని, "అదేమిటమ్మా, ఓ వారంరోజులపాటు యీ పిల్లలకింత అన్నం పెట్టలేక పోతానా? నా రమవంటి వాళ్ళే యీ బిడ్డలూను!" అన్నాడు.

కౌసల్య ఆయనతో సున్నితంగా చెప్పింది. "మీరు మాకు వసతి సౌకర్యం కల్పించటమే గొప్ప విషయం! ఇంక మిమ్మల్ని యిబ్బంది పెట్టడం మాకిష్టంలేదు!" అని.

రంగనాథరావు అయిష్టంగానే ఒప్పుకున్నాడు.

"ఈ రాత్రికి మాత్రం మీరంతా మా ఆతిథ్యం స్వీకరించితీరాలి! రేపట్నుంచి మీ ఇష్టప్రకారమే చేయవచ్చును" అన్నాడు.

కౌసల్య చిరునవ్వుతో తలూపింది.

4

మర్నాడుదయం రామవరంనుంచి బస్‌లో కేదారకోన స్పాట్‌కి చేరుకున్నారందరూ.

మొత్తం ముప్పయిరెండుమంది అమ్మాయిల్ని నాలుగు గ్రూపులుగా విభజించి అబ్జర్వేషన్‌కి కొన్ని లొకేషన్స్ సూచించింది కౌసల్య. హేమలత, జమునాబాయి వాళ్ళకు ఫైండింగ్స్ నోట్ చేయటానికి సహాయపడుతుండగా కౌసల్య అన్ని గ్రూప్స్‌ని సూపర్‌వైజ్ చేస్తూ తిరిగింది.

మధ్యాహ్నంవరకు అలా సర్వే చేస్తూనే వున్నారు అమ్మాయిలంతా. వంట ప్రయత్నాలు స్పాట్‌లోనే జరిగాయి.

అమ్మాయిలకి యీ టూర్ చాలా ఆనందంగా వుంది.

సాయంత్రం రామవరం తిరిగిపోయారు.

మూడు రోజులు యిదే విధంగా గడిచాయి.

నాలుగోరోజు ఉదయం బస్‌లో స్పాట్‌కొచ్చారంతా.

పదిగంటల ప్రాంతంలో కౌసల్య ఇద్దరు అమ్మాయిలు లేకపోవటం గమనించింది. ఓ అయిదు నిమిషాలు చూసింది. కాని, వాళ్ళు కనిపించలేదు.

కౌసల్యకి ఎందుకో అనుమానం వచ్చింది. హేమలతని పిలిచి చెప్పింది. ఆమెకూడా అమ్మాయిలందర్నీ పరీక్షగా చూసి, "అవును మేడం. నళిని, వసుధ కనిపించటంలేదు. నళిని గ్రూప్ టూ, వసుధ గ్రూప్ ఫోర్. ఇందాకటి వరకు నేను వాళ్ళకి కొన్ని ఫైండింగ్స్ నోట్ చేయటం వివరించాను కూడా" అన్నది ఆశ్చర్యంగా.

జమునాబాయి కూడా అంతక్రితం వాళ్ళని చూశానని చెప్పింది.

కౌసల్య కంగారుపడింది. లెక్చరర్సు యిద్దరికిగాని, తనకిగాని చెప్పకుండా ఆ యిద్దరు ఎక్కడికి వెళ్ళినట్లు?

కౌసల్య, హేమలత స్పాట్ కి రెండు వైపులా పరీక్షగా చూస్తూ గాలించటం మొదలెట్టారు.

ఎక్కడా నళిని, వసుధల జాడ కనిపించలేదు.

జమునాబాయిని స్టూడెంట్సు పర్యవేక్షణ చూడమని కౌసల్య హేమలత కొండకి అవతలిపక్క ఏటవాలుగా వున్న ప్రదేశానికి దిగారు.

అక్కడ కనిపించిన దృశ్యం వారిద్దరిలోను కోపావేశాలను ప్రజ్వరిల్ల చేసింది.

అక్కడ నళిని, వసుధ ఇద్దరు యువకులతో దాదాపు ఒళ్ళో కూచున్నంత సన్నిహితంగా ఒకరినొకరు ఒరుసుకుని కూచుని తన్మయత్వంలో వున్నారు.

కౌసల్య, హేమలత ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

కౌసల్యకు ఆ యిద్దరు యువకులు అక్కడికి యెలా, ఎప్పుడు వచ్చారో, వాళ్ళతో తన స్టూడెంట్సుకి అంత సన్నిహితత్వం ఎలా ఏర్పడిందో బోధపడలేదు.

కోపంగా "నళినీ, వసుధా" అని పిలిచింది కౌసల్య.

ఒక్కసారిగా వాళ్ళు నలుగురు దూరంగా విడిపోయారు. మగాళ్ళు లేచి పరుగెత్తబోయారు.

"స్టాప్ దేర్!" అరిచింది కౌసల్య.

మగాళ్ళిద్దరూ ఆగి వెనక్కి చూశారు.

నళిని, వసుధ ఎర్రగా కందగడ్డల్లా అయిన ముఖాలతో తల వంచుకుని నించున్నారు.

"ఏయ్ మిష్టర్, ఎవరు మీరు? ఇక్కడికెలా వచ్చారు? కమాన్ టెల్ మీ!" అన్నది కౌసల్య తర్జనితో వాళ్ళను

నూచిస్తూ అధికారపూర్వకంగా.

వాళ్ళిద్దరు నళిని, వసుధల వంక ఓసారి చూసి, "మేమూ యూనివర్సిటీ కాలేజీలోనే చదువుతున్నాం మేడమ్! నళిని, వసుధ మా బంధువులు అందుకని చూసి పోదామని....?"

"ఏమిటయ్యా చూసిపోయేది? వాళ్ళు యిప్పుడు మా ఆధీనంలో వున్నారు. వాళ్ళని కలుసుకోవాలంటే ముందుగా మా అనుమతి తీసుకోవాలనే కనీస జ్ఞానం లేదా మీకు? అయినా బొటానికల్ టూర్ మీద వచ్చిన పిల్లల్ని యిక్కడ కల్సుకోవటం తప్పని తెలీదా? ఇంకెప్పుడూ ఇలాంటి వెర్రి మొర్రి వేషాలు వెయ్యద్దు. మీ ప్రిన్సిపల్‌కి రిపోర్టు చేయవలసి వుంటుంది!" అన్నది కౌసల్య తీవ్రంగా.

"సారీ మేడమ్! ఫస్టెటం వదిలెయ్యండి. మాకు నళిని, వసుధలమీద దురభిప్రాయం ఏదీలేదు. మా పెద్ద వాళ్ళు మా జంటలకు త్వరలోనే పెళ్ళిళ్ళు చేయటానికి నిర్ణయించారు...."

"డోంటాక్ అన్నెససరీ థింగ్స్! ప్లీజ్ గెటవుట్!" అన్నది కౌసల్య. ఆ మగపిల్లలిద్దరు తిరిగిచూడకుండా అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

కౌసల్య వసుధ, నళినివంక నిప్పులు రాలుస్తున్న చూపులతో చూసి, "ఇది స్టడీ టూరనుకున్నారా, హనీ మూన్ అనుకున్నారా! మీలాంటి క్రమశిక్షణలేని పిల్లల వల్ల తక్కినవాళ్ళు చెడుమార్గాన నడిచే ప్రమాదముంది. మీమీద చర్య తీసుకోవలసి వుంటుంది!" అన్నది.

నళిని, వసుధ నిలువెల్లా వణికిపోతూ "క్షమించండి

మేడమ్! ఇంకెప్పుడూ ఇలాంటి పొరపాటు జరగనివ్వం!" అన్నారు ప్రాధేయపడుతూ.

"మైండ్ యువర్ బిజినెస్!" అన్నది హేమలత. క్షమించి వదిలెయ్యమని కౌసల్యవంక చూసింది.

కౌసల్య గుర్రుగా చూసింది.

నళిని, వసుధ బ్రతుకు జీవుడా అంటూ కొండపైకి ఎక్కే సీ స్టూడెంట్సుతో కలిసిపోయారు.

5

"వారం రోజులపాటు మమ్మల్నెంతో ఆదరంగా చూశారు మీ సహాయం మరచిపోలేను" అన్నది కౌసల్య రంగనాథరావుతో.

ఆయన మందహాసంచేసి, "మేము చేసింది చాలా తక్కువ. మీరే మీ భోజన ఏర్పాట్లు చేసుకున్నారు. ఈసారి ఈ సరంజామా ఏమీ తేనవసరంలేదని ముందుగానే చెబుతున్నాను. మీ తదుపరి జేచ్‌కి అన్ని ఏర్పాట్లు మేమే చూసుకుంటాం!" అన్నాడు.

కౌసల్య, హేమలత, జమునాబాయి స్నేహపూర్వకంగా నవ్వారు.

బస్ కదిలింది.

అమ్మాయిలంతా కేదారకోనలో తాము గడిపిన ఆ ఏడురోజుల, తమ అనుభూతుల్ని, అనుభవాల్ని నెమరు వేసుకుంటూ సీట్లోకి చేరగిరబడ్డారు.

ఉదయం ఎనిమిదిగంటలు కావస్తోంది.

"అమ్మా, మధ్యలో సింహపురి బంగళాలో వుంటాం కదా?" అడిగాడు యాదగిరి తలతిప్పకుండానే.

"అక్కర్లేదు! మనం ఏకబిగిన ప్రయాణంచేస్తే రాత్రి పదకొండు గంటలకంతా హైదరాబాద్ చేరిపోతాం!

ఈమాత్రానికి మధ్యలో హాల్టు అనవసరం! మొన్న వచ్చే టప్పుడు అర్ధరాత్రి రామవరం చేరటం కష్టమని మధ్యలో సింహాపురి బంగళాలో ఆగిపోయాం! అదీగాక వాళ్ళకు రిటన్‌లో ఆగుతామని ప్రోగ్రాం కూడా ఇవ్వలేదు" అన్నది కౌసల్య.

యాదగిరి తలూపాడు.

మధ్యాహ్నం లంచ్‌కి ఏదైనా వూళ్ళో హోటల్లో భోం చేయాలని నిర్ణయించుకున్నారు.

మధ్యాహ్నానికి బస్ సింహాపురి దాటింది!

అక్కడినుంచి ఘాట్ రోడ్ మొదలవుతుంది. దాదాపు అయిదు కిలోమీటర్ల రోడ్ అది! అన్నీ మెలికలు పాము మెలికలు! ఎగుడుదిగుళ్ళు. అక్కడ ఫారెస్టు తాణా వుంది. రోడ్‌కి అయి యిటు గుబురుగా పెరిగిన చెట్లు, దూరంగా ఆకాశాన్నంటుతున్నాయా అన్నట్టున్న సర్వే చెట్లు!

యాదగిరి చటుక్కున బస్ ఆపాడు.

ఒక్క జర్కుతో బస్ ఆగింది. చల్లటి గాలికి హాయిగా నిద్రలోకి జారిపోయిన అమ్మాయిలంతా త్రుళ్ళిపడి లేచారు.

రోడ్‌కి అడ్డుగా పెద్ద పెద్ద రాళ్ళు పేర్చబడి వున్నాయి!

6

సమయం మధ్యాహ్నం పన్నెండు గంటలు! మరో అరగంట ప్రయాణం చేస్తే మాచవరం వస్తుంది. అక్కడ భోజనాలు చేయాలని యోచిస్తోంది కౌసల్య.

ఇంతలో యీ అవాంతరం!

"ఎవరో ఆకతాయి పిల్లలు రాళ్ళు అడ్డం పెట్టారమ్మ

గారూ!" అన్నాడు యాదగిరి కిందికి దిగుతూ. క్లీనర్ కూడా అతనితో దిగాడు.

రాళ్ళు అడ్డు తొలగిస్తూండగా ఒక్కసారిగా పది మంది సాయుధులైన వ్యక్తులు బస్సుని చుట్టేశారు.

కౌసల్య, హేమలత, జమునాబాయి చిన్నగా ఆక్రందన చేశారు. అమ్మాయిల ప్రాణాలు పైనేపోయాయి!

"ఎవరూ పిచ్చి పిచ్చిగా ప్రవర్తించొద్దు! మేం చెప్పినట్టు చెయ్యండి!" అన్నాడు అందులో నాయకుడిలాగా వున్న ఓ వ్యక్తి. అతని చేతిలో గన్ తిన్నగా యాదగిరికి గురిపెట్టబడి వుంది. తక్కినవాళ్ళు కూడా తుపాకీలు వాళ్ళకు గురిపెట్టి నిల్చున్నారు.

కౌసల్య ఆదేశం కోసం అందరు ఆమెవంకే చూస్తున్నారు. ఆమె మెదడు మొద్దుబారిపోయింది. ఈ సంఘటన ఊహించనిది!

దుండగులందరు బస్ ఎక్కేశారు. తమ నగలు విలువైన వస్తువులు దోచుకుంటారేమోనని అమ్మాయిలంతా భయపడ్డారు. కౌసల్య కూడా అలాగే భావించింది.

కాని, వాళ్ళందరి ఊహలు తారుమారయ్యాయి.

నాయకుడు చివరగా బస్ ఎక్కాడు. ఎక్కేముందు దారికడ్డుగా వున్న రాళ్ళను తొలగించారు.

నాయకుడు యాదగిరిని బస్‌లోకి ఎక్కించాడు.

"నువ్వు మేం చెప్పినట్టు డ్రైవ్ చెయ్యి. ఏమాత్రం మొరాయించినా నీ చావు తప్పదు!" అన్నాడు.

యాదగిరి నిస్సహాయంగా చూశాడు కౌసల్యవంక.

క్లీనర్, అటెండర్లు, అకౌంటెంటు, అమ్మాయిలు అందరు— కౌసల్యవంకే చూస్తున్నారు.

కౌసల్య యాదగిరివంక సాభిప్రాయంగా చూసింది.

ఇప్పుడు తాము ఎదురుతిరిగి చేసేదేం లేదు. బస్ ని ఏదో నిర్జన స్థలంలో ఆపి తమవద్దనున్న బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు దోచుకుంటారు. రోడ్ మీద మరే వైనా వాహనాలు వస్తాయేమోనని ముందు జాగ్రత్త కోసం వాళ్ళకు అనుకూలమైన స్థలానికి బస్ ని తీసుకు పోయి నిలుపుతారు. ఇదివరకూ ఇలాంటి సంఘటనలు పేపర్లో వచ్చాయి.

అయితే అది అర్ధరాత్రి సమయంలో జరిగేది. ఇప్పుడు మిట్టమధ్యాహ్నం, పట్టపగలు జరుగుతోంది.

కౌసల్య నిస్సహాయంగా సీట్లో అసహనంగా కదిలింది.

దొంగల నాయకుడు చెప్పిన డైరెక్షన్స్ లో యాదగిరి బస్ ను తీసుకుపోతున్నాడు.

అందరి మనసులు భయంతో గిజగిజలాడుతున్నాయి. ఈ దొంగవెధవలు తమ ఆభరణాలు దోచుకున్నా ఫరవాలేదు, తమని క్షేమంగా వదిలేస్తే చాలునని వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.

కౌసల్య ఆలోచిస్తోంది! ఎవరో ముందుగా తమ బస్ ఆ దారిన వస్తున్న విషయం దొంగలకు చేరవేసి వుండాలి! అందుకే అంత ధైర్యంగా పట్టపగలు తమని దారి దోపిడీ చేస్తున్నారు. ఆడవాళ్ళు అబలలు అని తెలిసి, పగలే దారికాసి యిలా అఘాయిత్యానికి పూనుకున్నారు!

ఆమె మనసులో వసుధ, నళినీల బోయ్ ఫ్రెండ్స్ మెదుల్తున్నారు. ఈ సంఘటనకి, వాళ్ళకి ఏమైనా సంబంధముందా? కాదేమో! వాళ్ళు నాలుగురోజుల క్రితమే కేదారకోన వదిలిపోయారు. అయినా వాళ్ళ ప్రియురాళ్ళు కూడా బస్ లోనే వున్నారు. వాళ్ళకి

అపకారం తలపెడ్తారా? తన అనుమానానికి తననే నిందించుకుంది కౌసల్య.

"ఇక్కడ ఆపు!" అన్నాడు దొంగల నాయకుడు.

యాదగిరి బ్రేక్ వేసి బస్ ఆపాడు. కీచుమన్నాయి చక్రాలు!

అది ఘాట్ రోడ్ వదిలేసి దాదాపు రెండు మూడు ఫర్లాంగులు రాళ్ళు రప్పలతో నిండిన ప్రదేశం! చుట్టూ చెట్లు! బాగా గుబురుగా వున్న ప్రదేశంలో ఆపు చేయించాడు బస్! అక్కడ బస్ ఉనికి ఘాట్ రోడ్డున పోయే వాహనాలకు కనిపించే అవకాశం ఏ మాత్రం లేదు!

"దిగండి!" అన్నాడు నాయకుడు బస్ దిగుతూ.

తక్కిన తొమ్మిదిమందీ తుపాకులు ఆడవాళ్ళకు గురిచేసి వుంచి అలాగే వుంచారు. వాళ్ళ టార్గెట్ నుంచి మగ వాళ్ళు కూడా ఎవరూ తప్పించుకుపోకుండా తుపాకులు రౌండుగా పట్టుకున్నారు.

కౌసల్యతోబాటు తక్కిన వాళ్ళంతా ఆశ్చర్యంగా దొంగలవంకే చూస్తున్నారు. తాము ఊహించినట్టుగా వాళ్ళు తమ నగలని అడగలేదు! తమ సూట్ కేసుల్ని ముట్టుకోలేదు.

తమని ఏం చెయ్యబోతున్నారు?

ఈ ఆలోచన రాగానే అందరికీ ముచ్చెమట్లు పోశాయి.

కొంపతీసి ఈ దుర్మార్గులు తమని ...

వాళ్ళ ఆలోచనలు మధ్యలోనే ఆగిపోయాయి.

యాదగిరి అకస్మాత్తుగా ఓ అనుచరుడిమీదకు తిరగ బడి గన్ లాక్కున్నాడు.

ఊహించని యీ దాడి నెదుర్కొవటానికి ఆ అను

చరుడు సిద్ధంగా లేకపోయినా, నాయకుడు చాలా చురుగ్గా పని చేశాడు.

తుపాకిని గురిచూసుకోబోతున్న యాదగిరి చేతుల్లోంచి తుపాకి గాల్లోకి ఎగిరిపోయింది.

నాయకుడు విజయగర్వంతో నవ్వాడు.

యాదగిరి కుడిచేతినుండి ధారాపాతంగా నెత్తురు కారిపోతోంది!

"ప్రాణాలతో వదులున్నందుకు సంతోషించరా ఫూల్! బతకాలని లేదా?" అరిచాడు నాయకుడు.

అందరు యాదగిరి చొరవకు, తెగింపుకు ఆశ్చర్య పడ్డారు. అతని పరిస్థితికి బాధపడ్డారు.

"మీరందరూ మా వెంట మాట్లాడకుండా రండి. ఏమయినా వెర్రి మొర్రి వేషాలు వేస్తే మావాళ్ళు నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తారు" నాయకుడు హెచ్చరించాడు.

కౌసల్య తన నిస్సహాయతను బయటపెట్టుకోలేక మౌనంగా తల వంచుకున్నది. తక్కిన వాళ్ళు ఆమె పరిస్థితి గమనించి తాముకూడా మౌనం వహించారు.

ఇద్దరు అనుచరులు చకచక అందరి కళ్ళకు నల్లటి గంతలు కట్టేశారు. మగవాళ్ళను ఓ పక్కగా నిలబెట్టి చేతులు వెనక్కు తిప్పి వరసగా ఒకరికొకర్ని బంధాలు వేసేశారు. ఒకడు కదిలితే తక్కిన నలుగురు కదలవలసిందే.

ఆ తర్వాత నాయకుని కంఠం ఆజ్ఞాపించింది.

"ఒకరి వెనుక మరొకరు అలాగే నడవండి!" అని.

అందరూ క్యూలో నించున్నట్టు నించుని ఒకరి తర్వాత మరొకరు అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తూ ఓ సమతల ప్రదేశంలోకి వచ్చారు.

ఆ తర్వాత వాళ్ళ కళ్ళ గంతలు తొలగించబడ్డాయి.

అందరు కళ్ళు నులుముకున్నారు. ఓ అయిదు నిమిషాల పాటు ఎవరికీ కళ్ళు కనిపించలేదు.

"దిగండి!" అన్నాడు నాయకుడు.

అప్పుడు చూశారు అందరు అక్కడున్న చెక్క మెట్లను!

కిందికి ఏదో భూగృహంలా వుంది. చెక్కతో కూర్చిన మెట్లున్నాయి.

ఇద్దరు అనుచరులు ముందుగా దిగారు మెట్లుమీదుగా. తర్వాత మగవాళ్ళని దింపారు. ఆ వెనక ఆడపిల్లలంతా ఒకరి తర్వాత ఒకరు దిగారు. అందరు గుండె రాయి చేసుకుని కిందికి దిగారు. వాళ్ళు తమని ఏం చెయ్య బోతున్నారోనన్న వూహ వాళ్ళందరికీ తడుతూనే వుంది!

కౌసల్య మెల్లగా ఓ అమ్మాయి చెవిలో ఏదో వూదింది. అది అలా అలా ముప్పయి యిద్దరు అమ్మా యిలకి హేమలతకీ, జమునాబాయికీ చేరిపోయింది. తమ శీలానికి ప్రమాదం ఏర్పడే పక్షంలో అందరు సామూ హికంగా తిరగబడి వాళ్ళని చంపెయ్యటమో తాము చావటమో తేల్చుకోవాలిగాని, యెట్టి పరిస్థితుల్లోను లొంగకూడదని!

అందరిలోను తెగింపు, పౌరుష వచ్చేశాయి. విజ యమో, వీర స్వర్గమో, అనే నినాదం గుర్తువచ్చి వాళ్ళ దేహాలు రోమాంచితాలయ్యాయి. దొంగలు తమ ఆభర ణాలకి ఆశపడటంలేదన్న విషయం అందరికీ అప్పటికే అర్థమైపోయింది. ఇక తామందరు వయసులో వున్న ఆడపిల్లలు! తమ దగ్గర దోచుకునేందుకు కన్యాత్వమే కదా వున్నది—ఆభరణాలు తప్పిస్తే....!

కౌసల్యకు యిలాంటి అనుభవం ఎప్పుడూ యెదురు కాలేదు. అర్ధరాత్రి సమయాల్లో కూడా ఈ రోడ్డున ప్రయాణం చేసిన సందర్భాలున్నాయి. కాని ఎన్నడూ యిలాంటి దోపిడి దొంగల్నిగాని, అవాంఛనీయ సంఘటనల్నిగాని ఎదుర్కోలేదు.

మెట్లు పూర్తయి సొరంగంలోకి దిగారు అందరూ. అక్కడికి ఎక్కడినుంచో వెలుగు రేఖలు వచ్చి పడుతున్నాయి. నేలంతా చిత్తడిగా వుంది.

ఇద్దరు దారి చూపుతున్నారు.

వెనక అందరు అసంకల్పితంగానే కదిలి వెళుతున్నారు!

చిత్రం! అదో చిన్న సైజు చెరసాలలా వుంది! అక్కడ అప్పటికే కొంతమంది అమ్మాయిలు కటకటాల గదుల్లో బంధింపబడి వున్నారు. వాళ్ళు కౌసల్య బృందాన్ని చూడగానే లేచి కటకటాల దగ్గరకొచ్చి తదేకంగా వాళ్ళనే చూడసాగారు. మీరూ చిక్కారా? అన్నట్టున్నాయి వాళ్ళ చూపులు!

వాళ్ళని చూశాక అందరిలోను తేలుకుండీల్లాంటి ప్రశ్నలు తలెత్తి వేధించాయి.

వాళ్ళు ఎవరు? తమలాగానే వీళ్ళ చేతుల్లో చిక్కిన తమలాంటి ఆడవాళ్ళేనా? వాళ్ళని అలా చెరసాలలో బంధించినట్టు ఎందుకు బంధించారు?

అన్నీ ప్రశ్నలే! జవాబు లేదు.

నాయకుడు అనుచరులవంక చూసి తలెగరేశాడు.

ఓ అనుచరుడు కుడిపక్కగా వున్న కటకటాల తలుపులు తెరిచాడు. కొంతమందిని ఆ గదిలోకి నడవమని ఆజ్ఞాపించాడు నాయకుడు.

మరో అనుచరుడు ఎడమపక్కగా వున్న కటకటాల తలుపులు తెరిచాడు. తక్కిన వాళ్ళను ఆ గదిలోకి నడిపించారు. తలుపులు మూసి తాళాలు వేశారు.

కౌసల్య, హేమలత ఓ గదిలోను, జమునాబాయి ఓ గదిలోను అమ్మాయిలతోబాటు బంధింపబడ్డారు.

పరంధామయ్యను, యాదగిరిని, క్లీనర్ని, యిద్దరు అటెండర్లని అలాగే తాళ్ళతో బంధించి వుంచారు.

అకౌంటెంటు పరంధామయ్య అంతదాకా నిగ్రహంగా ఓర్చుకున్నవాడల్లా నాయకుడ్ని అడిగేశాడు.

“మమ్మల్ని ఎందుకు బంధిస్తున్నావు? ఏం కావాలి నీకు? బంగారం, వస్తువులు కోరి నువ్విలా చెయ్యటం లేదని మాకర్థమవుతూనే వుంది. ఇంకేం కావాలి....?”

నాయకుడు సారంగం ఎగిరిపోయేలా ఫెళ్ళున నవ్వాడు.

“ఓ ముసలోడా, యింతదాకా వూరుకుని యిప్పుడు మొరుగుతున్నావేమిటి? మమ్మల్నే ప్రశ్నించేటంత ధైర్యం వచ్చిందా నీకు?” అంటూ సూటిగా పరంధామయ్య దగ్గరకు వెళ్ళి ఫెళ్ళున చెంపలు రెండు వాయించాడు.

పరంధామయ్య బాధతో మూలిగాడు. నోటి చివర్ల నుండి సన్నగా నెత్తురు కారింది.

“పరంధామయ్యగారూ! ఇలాంటి మూర్ఖులతో సంవాదం పెట్టుకోకూడదు!” అన్నది కౌసల్య.

ఆమె నెత్తురు మరుగుతోంది. తమ అందరికన్న వయసులోను, అనుభవంలోను పెద్దవాడైన పరంధామయ్యను నాయకుడు హింసించటం చూసి ఆమె సహించలేకపోయింది.

“ఎవరూ నోళ్ళు మెదపవద్దు. మిమ్మల్ని యిక్కడికి

ఎందుకు తీసుకొచ్చానో, ఏం చెయ్యబోతున్నానో ముందు ముందు మీకే అర్థమవుతుంది. అంతదాకా బుద్ధిగా పడున్నారా సరే, లేకపోతే మీ మాన ప్రాణాలు మీవి కావు!" అన్నాడు నాయకుడు అందరివంకా క్రూరంగా చూస్తూ.

ఆడవాళ్ళందరికీ ఆ నాయకుడిలో తాము చిన్ననాడు చదువుకున్న కథల్లోని ఒంటి కంటి రాక్షసుడు మెదిలాడు. రాజకుమార్తెలను బంధించి హింసించే రాక్షసుల కథలు కళ్ళముందు కదిలాయి. ఆ రాక్షసులకు ఏ మాత్రం భిన్నంగా లేడు యీ నాయకుడు.

సమయం మధ్యాహ్నం రెండుగంటలు దాటినా ఎవరికీ ఆకలి కావటంలేదు. ఆ స్పృహే లేదెవరికీ. తమ దురవస్థను తామే విలపిస్తున్నట్టు అందరూ మూగగా రోదిస్తున్నారు.

"అక్కడే బస్ దగ్గర ఎదురుతిరిగి చావో బ్రతుకో తేల్చుకోవలసింది మేడం!" అన్నది హేమలత ఉక్రోషంగా. కౌసల్య ఆమెవంక విషాదంగా చూసింది.

"మీరే నా స్థానంలో వుంటే అంతకన్న భిన్నంగా ప్రవర్తించివుండరని నా నమ్మకం! చేతులారా ప్రాణాలు పోగొట్టుకోవటం తప్పితే వాళ్ళ నెదిరించి ఏం చెయ్యగలం....?" అన్నది కౌసల్య.

అమ్మాయిలంతా కన్నీళ్ళు నిండిన కళ్ళతో బేలగా తమ ఉపాధ్యాయినులవంక చూస్తున్నారు.

నాయకుడు అందర్నీ ఉద్దేశించి అరుస్తూ చెప్పాడు.

"కాస్సేపట్లో మీకు భోజనాలు పంపించబడతాయి. తిని విశ్రాంతి తీసుకోండి!"

"నీ ఆతిథ్యం తగలడినట్టే వుంది" అన్నది హేమలత

కనిగా. జమునాబాయి, తక్కిన అమ్మాయిలు వాళ్ళ కెదురుగావున్న గదిలోనుంచి దీనంగా కౌసల్య వాళ్ళున్న గదివైపు చూస్తున్నారు. ఎదురుబొదురుగా వున్న కటకటాల గదులు!

మూడువైపులా కటకటాల గదులే! తాము లోపలికి ప్రవేశించిన సమతల ప్రదేశం మెట్ల దగ్గర్నుంచి ప్రారంభమయింది. అది మాత్రమే ఓపన్‌గా వుంది.

మూడోవైపు కటకటాల గదిలోని అమ్మాయిలు కూడా దాదాపు తమ వయసువాళ్ళే కావటం వాళ్ళకు ఆశ్చర్యంగా వుంది.

అందరు ఒకే వయసువాళ్ళని ఎత్తుకు తీసుకురావటంలో వీళ్ళ ఉద్దేశ్యం ఏమై వుంటుంది?

7

సాయంత్రం ఎప్పుడయిందో ఎప్పుడు చీకటిపడిందో గుర్తించే స్థితిలో లేరు వాళ్ళు. కాగడాల వెలుతురు సొరంగంలో పరుచుకోవటాన్నిబట్టి చీకటిపడి వుంటుందన్న భావన వచ్చి వాచీలు చూసుకున్నారు.

సాయంత్రం అయిదు కావస్తోంది. బయటకన్న లోపలి వెలుగు తగ్గిపోవటం సహజం! అందునా సొరంగంలో పగలు రాత్రిళ్ళు ఒకేలా వుంటాయి! కాని ఈ సొరంగంలోకి ఎక్కడినుంచో పగలు వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేసుకున్నట్టుంది!

దొంగలు తెచ్చిపెట్టిన అన్నం పళ్ళాలు అలాగే వున్నాయి. మట్టి మూకుళ్లాంటి పాత్రల్లో కొంత అన్నం, సాంబారు ఏదో కూర వేసి అచ్చం ఖైదీలకు పంచినట్టే పంచారు దొంగలు.

ప్రస్తుతం వాళ్ళు దొరలు, తాము దొంగలు!

ఈ ఆలోచన రాగానే నీరసంగా నవ్వుకుంది కౌసల్య!

"వీళ్ళు మనల్ని ఏం చెయ్యబోతున్నారోననే ఆలోచిన పక్కన పెట్టి, యిక్కడ్నుంచి తప్పించుకునే మార్గమేదన్నా వుందా అని ఆలోచించాలి!" అన్నది హేమలత.

కౌసల్య, తక్కిన పిల్లలు ఆమెవంక చూశారు.

"మనం వచ్చిన దారి గుర్తున్నది కదా. ఆ దారమ్మటే రోడ్ చేరిపోతే ఘాట్ రోడ్ వస్తుందని నా అంచనా. ఘాట్ రోడ్ చేరిపోతే ఏదో విధంగా మనకి సహాయం అందకపోదు!" అన్నది హేమలత.

కౌసల్య ఆమెవంక విడ్డూరంగా చూసి, "మనం ఈ రాక్షసుల బారినుండి తప్పించుకోగలమని మీకింకా నమ్మకం పోలేదన్నమాట!" అన్నది.

"ఆత్మవిశ్వాసం వుంటే ఏదైనా సాధించగలుగుతాం మేడం! మనమందరం తప్పించుకోనవసరంలేదు. యే ఒక్కరు తప్పించుకోగలిగినా, ఈ దుర్మార్గులు మనల్ని ఏమైనా చేయకముందే అందరికీ విముక్తి దొరుకుతుంది!"

కౌసల్య సాభిప్రాయంగా చూసిందామెవంక. కనీసం ఆ ఒక్కరైనా తప్పించుకోవటాని కవకాశమేది? ఓ పక్క వేటకుక్కల్లా పదిమంది దొంగలు కాచుకుని వున్నారు. నలుగురు బయటకు వెళ్ళినా తక్కినవాళ్ళు అనుక్షణం తమని కావలి కాస్తూనే వున్నారు.

"నేను ప్రయత్నిస్తాను మేడమ్!" అన్న అమ్మాయి వంక కళ్ళు పెద్దవి చేసుకుని చూసింది కౌసల్య.

ఆమె వసుధ! తను చివాట్లు వేసిన అమ్మాయి.

"ఏమిటి నువ్వు నేది?"

"అవును మేడం! నేను తప్పించుకునే యత్నం చేస్తాను. ఆ ప్రయత్నంలో విజయం సాధించగలిగితే అందరకూ విముక్తి కలుగుతుంది. ఫెయిలయితే, నేనొక్కదాన్నే చస్తాను. నాకు చావంటే భయంలేదు!"

అంత నిబ్బరంగా చెప్తున్న ఆ పిల్ల మాటలు వింటున్న కౌసల్య విస్తుపోయి, ఆప్యాయంగా, ఆత్మీయంగా చూసింది వసుధవైపు. ఈ పిల్లని తను అపార్థం చేసుకుంది. బాధ్యతలేకుండా అల్లరిచిల్లరిగా అబ్బాయిలతో తిరిగే రకంలా నిర్ధారించుకుంది.

కౌసల్య కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి. వసుధను పక్కన చేర్చుకుని, "నిజంగానే అంటున్నావా యీ మాట?" అన్నది. ఆమెకు చాలా ఆనందంగా వుంది. తన అంచనా తప్పయినందుకు బాధకన్న, రాబోయే ప్రమాదంనుంచి తమను రక్షించేందుకు ఓ అమ్మాయి సిద్ధపడటం సంతోషాన్ని కలిగించింది.

"ఎలా వెళ్తావు? వాళ్ళందరు కాపలా వున్నారుగా!" అన్నది హేమలత వాళ్ళవంక చూస్తూ.

"అదే ఇప్పుడు ప్లాన్ చెయ్యాలి మేడం!" అన్నది వసుధ.

అందరూ దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు ముఖాలే చెప్తున్నాయి.

రాత్రి భోజనాల సమయంలో నాయకుడు మళ్ళీ అందర్నీ ఉద్దేశించి చెప్పాడు.

"మీరు నిరాహార దీక్షలు సామూహికంగా చేసి సాధించేదేమీ లేదు. కడుపు మాడితే మీరే తింటారు, మిమ్మల్ని బతిమాలే ప్రసక్తి లేదు!"

అతని మాటలు విన్నాక తిండిలేక చావనైనా

చావాలిగాని, ఏం తినకూడదని నిర్ణయించుకున్నారందరూ.

ఖైదీలకు సరఫరా చేసినట్టు మట్టి మూకుళ్ళలో మళ్ళీ ఇంత అన్నం, సాంబారు, ఏదో కూరా తెచ్చి పడేశారు. కటకటాల తలుపులు తియ్యకుండానే కిందనున్న ఖాళీల గుండా మూకుళ్ళు లోపలకు తోసేశారు.

అకౌంటెంటు పరంధామయ్యా, డ్రైవర్ యాదగిరీ తక్కిన ఆటెండర్లు — అలాగే బంధింపబడి వున్నారు. వాళ్ళకి కూడా అన్నం పళ్ళేలు సరఫరా చేయబడ్డాయి. కాని ఎవ్వరూ ఆ మూకుళ్ళ జోలికి పోలేదు.

8

రాత్రి పదిగంటలు దాటి పదినిమిషా లయింది.

వసుధ లేచి నిలబడింది. అక్కడ కాపలా కోసమని యిద్దరు అను-చరులు వుంచబడ్డారు. తక్కిన ఎనిమిదిమంది-నాయకుడితోసహా ఎక్కడికి వెళ్ళారో తెలియదు.

వసుధ ఓ అనుచరుణ్ని సైగచేసి పిలిచింది.

వాడు దగ్గరగా వచ్చి నించుని ఏం కావాలన్నట్టు చూశాడు.

వసుధ సిగ్గు నటించి, "బయటకు వెళ్ళాలి! మళ్ళీ అయిదు నిమిషాల్లో వచ్చేస్తానుగా!" అన్నది.

అనుచరుడు వెనక్కి వెళ్ళి రెండో అనుచరుడితో ఏదో మాట్లాడి వచ్చాడు. చేతిలో తాళాలగుత్తి వున్నది. దాంతో ఓ తాళం వెతికి కటకటాల గది తెరిచాడు.

వసుధ బయటికి కాలుపెట్టగానే మళ్ళీ తాళం వేసేశాడు. ఆమెని అనుసరించబోయాడు.

వసుధ అతినిశంక కోపంగా చూసింది. "ఏమిటి నీ ఉద్దేశ్యం? నేను ఎందుకు బయటికొచ్చానో ఆ మాత్రం

అర్థం కాలేదా?" అన్నది.

అనుచరుడు వెనక్కి తగ్గాడు. "సరే! ఓ అయిదు నిమిషాలే, ఎక్కువసేపు వుంటే కుదరదు!" అన్నాడు.

వసుధ తలాడించింది.

అనుచరుడు అక్కడే నిల్చుండిపోయాడు. అయిదు నిమిషాలు....పది నిమిషాలు.

అనుచరుడికి అనుమానం వచ్చింది. చకచక వసుధ వెళ్ళినవైపు అడుగులు వేశాడు.

వసుధ కనిపించలేదు.

అనుచరుడు పిచ్చిగా అటు ఇటు పరుగులు పెట్టి వెతుకుతున్నాడు. వసుధ జాడలేదు.

అనుచరుడు భయపడుతున్నాడు. నాయకుడికి తెలిస్తే తన ప్రాణాలకు ముప్పు తప్పదని అతనికి తెలుసు! అందుకే హడావిడిగా సారంగమంతా వెతికేస్తున్నాడు.

"ఇదిగో, దీని కోసమేనా వెతుకుతున్నావు?" అన్న మాటలు విని ఉలిక్కిపడి అటు చూశాడు అనుచరుడు.

తమ నాయకుడు! ఓ చేతిలో తుపాకీ, మరో చేతిలో వసుధ జుట్టు! వసుధని జుట్టుపట్టి బరబర లాక్కొస్తున్నాడు.

అనుచరుడితోపాటు కటకటాల గదుల్లో వున్న వాళ్ళందరు విస్తుపోయి చూస్తున్నారు.

నాయకుడు వసుధను ఒక తోపు తోశాడు. అమాంతం నేలమీద పడిపోయిందామె. మోకాళ్ళు మోచేతులు నేలకి కొట్టుకుని చెక్కుకుపోయాయి.

"ఏమే, ఇక్కడినుంచి తప్పించుకుపోగలననే అనుకున్నావా? ఈ అర్థరాత్రి నిన్నెవరు రక్షిస్తాడనుకున్నావు?" వ్యంగ్యంగా అంటున్నాడు నాయకుడు.

అతని పదజాలం అసహ్యంగా వుంది. వినేవాళ్ళకు జుగుప్స కలిగించేలా వుంది!

కౌసల్య, హేమలత తక్కిన ఆడవాళ్ళందరూ వసుధ వంక జాలిగా చూస్తున్నారు.

నాయకుడు వసుధ దగ్గరకొచ్చి మళ్ళీ జుట్టుపట్టి పైకి లేవతీశాడు. రెండు చెంపలు చెళ్ళు చెళ్ళున చరిచాడు. వసుధకి కళ్ళు తిరిగాయి. తూలి కిందపడిపోయింది.

"జాగ్రత్త. పిచ్చివేషాలు వేస్తే ప్రాణాలు దక్కవు. బయటికి పోవటం అంత తేలికనుకున్నావా? పో లోపలికి!" అంటూ ఓ అనుచరుడికి సైగచేశాడు. ఎప్పుడు వచ్చారో తక్కిన ఏడుగురు అనుచరులు కూడా బిలబిలమని అక్కడ ప్రత్యక్షమయ్యారు.

వసుధని, తాళంతీసి కటకటాల గదిలోకి నెట్టేశాడు.

నాయకుడు వసుధని బయటకి వదిలిన అనుచరుడి దగ్గరకు అడుగులు వేశాడు. వాడు భయపడిపోయి నాయకుడి కాళ్ళమీద పడ్డాడు. నాయకుడు వాణ్ని పైకి లేపాడు. వికటంగా నవ్వాడు.

మరుక్షణం తుపాకీతో వాడిని కాల్చేశాడు. అనుచరుడు అమాంతం నేలకూలి ప్రాణాలు వదిలాడు.

తక్కిన అనుచరులు తలలు వంచుకుని నించున్నారు.

"జాగ్రత్త నాకు కోపం తెప్పించటానికి ప్రయత్నించవద్దు!" అన్నాడు.

• • •

"కాస్తలో తప్పించుకునే అవకాశం పోయింది. మెట్లెక్కి అవతలకి చేరిపోయాను. సరిగ్గా ఎక్కడ్నించి వూడిపడ్డాడో — తన అనుచరులతో వచ్చేశాడు. నన్ను

పట్టేసుకున్నారు" అన్నది వసుధ.

కౌసల్య బాధగా చూసింది. "చక్కటి అవకాశం చేజారిపోయింది. ఇక తప్పించుకోగలమన్న ఆశలేదు" అన్నది.

"ఏ మాత్రం అవకాశమున్న నేను పారిపోతాను" అన్నది వసుధ.

"ఈసారి దొరికిపోతే నిలువునా ప్రాణాలు తీసేస్తాడు దుర్మార్గుడు!" హేమలత అన్నది.

"నాకే భయం లేదు. మనవాళ్ళందరికోసం నా ప్రాణాలు బలిచేయటానికి సిద్ధంగా వున్నాను, అవకాశం రావాలిగాని!" అన్నది వసుధ.

"వీడు చాలా క్రూరుడు—తన మనిషినే నిలువునా చంపేశాడు. మనల్ని వదుల్తాడా?" కౌసల్య అన్నది.

ఇంతలో చిన్నరాయి దొర్లుకుంటూ వాళ్ళ మధ్యకు వచ్చి పడింది.

రాయికి చుట్టి ఓ చీటీ వుంది.

కౌసల్య చీటీ విప్పి చదివింది.

అందులో రెండే వాక్యాలున్నాయి.

"వీళ్ళు అమ్మాయిల్ని ఎందుకు నిర్బంధిస్తున్నారో తెలిసిపోయింది. అరబ్ దేశాలకు అమ్మాయిల్ని దొంగచాటుగా రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం షిప్పు రావటంకోసం ఎదురుచూస్తున్నారు. రాగానే అందర్నీ అందులో రవాణా చేసేస్తారు!" అని వున్నది అందులో.

కౌసల్య చదివి, పరంధామయ్యవైపు చూసింది. ఆ దస్తూరీ ఆయనదే! కౌసల్యకి తెలుసు.

పరంధామయ్య మౌనంగా తలూపాడు.

క్షణాలమీద విషయం అందరికీ తెలిసిపోయింది. అందరు భయభ్రాంతులై దీనంగా ఒకరినొకరు చూసుకుని మౌనంగా రోధిస్తున్నారు.

అర్ధరాత్రి అయినా యెవరూ నిద్రపోవటంలేదు. కటకటాల గదుల్లో కటిక నేలమీద కూలబడి విలపిస్తున్నారు.

9

"సార్, మనం కట్లు తెంచుకుంటే, వీళ్ళమీద అకస్మాత్తుగా దాడిచేసి తుపాకీలు వశపరచుకోవచ్చు. కనీసం రెండు తుపాకీలు దొరికినా చాలు, ఎలాగో బయటపడి మనవాళ్ళకి పోలీసు రక్షణ సంపాదించవచ్చు" అన్నాడు యాదగిరి గుసగుసగా.

పరంధామయ్య, ఆ టెండర్లు, క్లీనరు అతని మాటలు జాగ్రత్తగా విన్నారు.

"అది అంత తేలికని నేననుకోవటంలేదు. ఏమాత్రం తేడాపాడా వొచ్చినా నిర్దాక్షిణ్యంగా కాల్చి పారేస్తారు వీళ్ళు" పరంధామయ్య అన్నాడు.

"మనకెలాగూ చావు తప్పదు. చచ్చేలోపల మన వాళ్ళను విడిపించి రక్షించగలిగితే చాలు!"

పరంధామయ్య తల విదిలించాడు.

"ఆ కాగడా దాకా వెళ్ళగలిగితే కట్లు కాల్చెయ్య వచ్చును. ప్రయత్నిద్దాం" అన్నాడు.

అయిదుగురికీ లింకు బంధం వేసేశారు. ఒకడు కదిలితే అయిదుగురూ కదలాల్సిందే!

పరంధామయ్య చుట్టూ పరికించి చూశాడు.

నాయకుడు, ఆరుగురు అనుచరులు యెక్కడికో వెళ్ళారు. బహుశా చచ్చిన అనుచరుడ్ని పూడ్చెయ్య

టానికి పోయారేమో! ఇద్దరు అనుచరులు మళ్ళీ యథావిధిగా కాపలా వున్నారు. చచ్చినవాడి స్థానంలో మరొకడున్నాడు.

పరంధామయ్య యాదగిరి తక్కిన ముగ్గురు కాగడా వైపు కదిలారు. ఒక్కొ అడుగే అటు వేస్తున్నారు. అనుచరులు నిద్రమత్తులో జోగుతున్నారు.

కాగడా దగ్గరకు చేరుకున్నారు. కాగడా ఎత్తులో వుంది. ఏదయినా ఎత్తయిన రాయో మరేదో వేసుకుంటే గాని కాగడా అందదు

యాదగిరి చుట్టూ చూశాడు. దూరంగా బండరాయి వున్నది. కాని దాన్ని దొర్లించి తెచ్చుకునేంత సమయం లేదు—అనుచరుల దృష్టిలో పడక తప్పదు!

కౌసల్య—యాదగిరి, పరంధామయ్యల ప్లాన్ అర్థం చేసుకున్నది. యాదగిరికి సంజ్ఞ చేసింది.

అయిదుగురు కౌసల్య వున్న కటకటాల గది వైపు జరిగారు. అనుచరులు చూస్తున్నపుడు ఆగిపోయి, వాళ్ళు గమనించనప్పుడు ఒక్కొ అంగుళమే జరుగుతూ కటకటాల గది చేరుకున్నారు. కటకటాల వెనక్కు తమ బంధనాలు వచ్చేలాగా నిల్చున్నారు.

క్షణాలమీద కౌసల్య, తక్కిన అమ్మాయిలు వాళ్ళ బంధనాలు విప్పేశారు.

అంతే, యాదగిరి తక్కిన వాళ్ళకు సైగచేసి ఒక్కసారిగా నిద్రమత్తులో జోగుతున్న అనుచరులిద్దరిమీదికి దాడిచేశారు. వాళ్ళు తుపాకులు చేతుల్లోకి తీసుకునే లోపలే వాళ్ళిద్దర్నీ తాళ్ళతో బంధించేశారు.

అనుచరులు అరవబోయారు. యాదగిరి సంకోచించకుండా యిద్దర్నీ కాల్చేశాడు.

అదే అతను చేసిన పొరపాటు!

బుల్లెట్ల శబ్దం సారంగంలో మార్మోగింది.

మరుక్షణం ఎక్కడినుంచో నాయకుడు ఆరుగురు అనుచరులు బిలబిలమంటూ వచ్చేశారు.

వాళ్ళని చూస్తూనే యాదగిరి గురిచూసి కాల్చాడు. కాని ఏడు తూటాలు ఒకేసారి అతని శరీరాన్ని తూట్లు పొడిచాయి.

'అబ్బా' అంటూ నేలవాలిపోయాడు యాదగిరి.

అనుచరులు యిద్దర్ని నేలకూల్చాడు తనతోపాటు.

ఇక నాయకుడు, అయిదుగురు అనుచరులు మిగిలారు.

యాదగిరికి తప్ప తక్కిన నలుగురికీ తుపాకీ పట్టడం రాదు. పరంధామయ్య, అటెండర్లు, క్లీనరు నిస్సహాయంగా నిల్చుండిపోయారు.

నాయకుడు వాళ్ళ నలుగుర్నీ సమీపించి, "ఏరా మిమ్మల్ని యెవర్రా విడిపించింది? ఈ ఆడవాళ్ళేనా! వీళ్ళని మిమ్మల్ని కూడా అంత తేలిగ్గా వదలను. నలుగురు మెరికల్లాంటి నా వాళ్ళను చంపాడు మీ డ్రయివర్. నేను తల్చుకుంటే ఈ క్షణమే మీ అందర్నీ ముక్కలు ముక్కలుగా కోసి, చిత్రవధ చేసి చంపగలను. కాని మిమ్మల్ని చంపటం నా ఉద్దేశ్యంకాదు! నా క్కావలసింది అమ్మాయిలు. ఆ ముగ్గురు ముసలమ్మల్ని, మీ మగ వెధవల్ని నా పనయిపోయాక వదిలేద్దామనుకున్నాను. కాని మీలో ప్రతిఒక్కడూ, ప్రతి ఆడదీ ప్రమాదకరమైన వ్యక్తుల్లాగానే కనిపిస్తున్నారు!"

అంటూ కౌసల్య వాళ్ళున్న గది దగ్గరకు చేరి, "వీళ్ళ బంధాలు ఎవరు విప్పారు? చెప్పండి, లేకపోతే మీ ఆడవాళ్ళందర్నీ ఈ క్షణమే నగ్నంగా నించోబెట్టి మీ

పరువుతీస్తాను!" అన్నాడు క్రూరంగా.

అమ్మాయిల గుండెలు గుబగుబ లాడాయి. యిలాంటి అవాంతర పరిస్థితిని ఎప్పుడో అప్పుడు ఎదుర్కోవలసి వస్తుందని వాళ్ళు ఎదురుచూస్తూనే వున్నారు.

నాయకుడి మాటలు వాళ్ళమీద బాగా పనిచేశాయి.

అన్నట్టుగానే వాడు, వాడి అనుచరులు తమని నగ్నంగా చేసి....

గుండెలమీద చేతులు వేసుకున్నారు భయంగా.

"చెప్పరేం? ఎవరు వీళ్ళ కట్లు విప్పదీసింది?" గర్జించాడు నాయకుడు.

"నేనే!" అన్నది గంభీరంగా కౌసల్య.

"ఓ ముసలిదానా, నువ్వా? నువ్వొక్కదానివే కాదు. ఇంకా తక్కినవాళ్ళు కూడా వుండివుంటారు. వాళ్ళెవరో చెప్పండి. లేకపోతే మొత్తం మీ అందర్నీ గుడ్డలూడదీసి నేలమీద పార్లిస్తాను."

అమ్మాయిలు వినలేనట్టు చెవులు మూసుకున్నారు.

నాయకుడు కటకటాల్లోంచి చెయ్యిచాచి కౌసల్య చెంపలు చెళ్ళు మనిపించాడు.

బాధని పళ్ళబిగువున అపుకున్నదామె.

"ఏమే. తక్కిన వాళ్ళెవరంటే చెప్పరేం? అందర్నీ నేలమీద పార్లించేవరకు చెప్పరా?"

నాయకుడు ఓ అమ్మాయి చీరపట్టుకుని లాగేశాడు.

అమ్మాయిలంతా భయంగా ఆర్తనాదాలు చేశారు.

నాయకుడు వికటంగా నవ్వాడు. తక్కిన అనుచరుల వంక చూసి సైగచేశాడు. వాళ్ళు కూడా నాయకుడి పక్కకువచ్చి కటకటాల్లోనుంచి చేతులు చాచారు.

సరిగ్గా అదే సమయంలో చెక్కమెట్ల దగ్గర చప్పు

డయింది.

నాయకుడితో బాటు అందరి దృష్టి మెట్లవైపు మళ్ళింది.

మెట్ల దగ్గర ఎవరో వ్యక్తి నించున్నాడు.

“దొరా, పిప్పా వచ్చింది!” అన్నాడా వ్యక్తి.

నాయకుడు తను చేస్తున్నపని వదిలేసి, “అలాగా! మంచి కబురు తెచ్చావు. మనవాళ్ళు వస్తున్నారా?” అన్నాడు చకచక ఆ వ్యక్తివైపు కదుల్తూ.

రేపు వస్తారు. పిప్పా రేపు రాత్రికి తిరిగి బయల్దేరుతుంది...”

నాయకుడు అనుచరులవంక సైగ చేసి, “మీరు ఎక్కడికీ పోకుండా జాగ్రత్తగా కాపలా వుండండి. నేనిప్పుడే వస్తాను” అని చెప్పి వచ్చిన వ్యక్తితో వెళ్ళిపోయాడు.

అమ్మాయిలందరి ప్రాణాలు కుదుటపడ్డాయి.

అనుచరులు పరంధామయ్యను, ఆ టెండర్లను, క్లీనర్‌ని మళ్ళీ తాళ్ళతో బంధించేశారు.

10

“కాస్తలో మనకు విముక్తి కలగాల్సింది తప్పిపోయింది” అన్నది హేమలత విచారంగా.

అమ్మాయిలందరు కౌసల్యను సమీపించి, “మేడం, మా గురించి ఆ రాక్షసుడి చేతిలో దెబ్బలు తిన్నారు” అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారు.

“దట్సాల్ రైట్! మనం బయటపడే దారి ఇక శాశ్వతంగా మూసుకుపోయింది. మనకోసం పాపం మన యాదగిరి ప్రాణత్యాగం చేశాడు. అతను చేసిన సేవ సామాన్యమైనది కాదు” అన్నది కౌసల్య నెత్తుటి మడుగులో పడున్న యాదగిరిని చూస్తూ.

అందరు యాదగిరికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఎదుటి గదినుంచి జమునాబాయి, తక్కిన అమ్మాయిలు యాదగిరినే చూస్తున్నారు.

కౌసల్య అమ్మాయిలవంక తిరిగి, "మీకు షూట్ చెయ్యటం వచ్చుకదా!" అన్నది.

"వచ్చు మేడమ్! ఎన్.సి.సి.లో నేర్పించారు కదా!" అన్నారు అందరు ఏకకంఠంతో.

"నెమ్మదిగా మాట్లాడండి. ఆ రాక్షసులు యిటే చూస్తున్నారు....వినండి....ఏమాత్రం వీలున్నా వాళ్ళ దగ్గర్నుంచి తుపాకీలు లాక్కొని వాళ్ళని ఎదుర్కొందాం. షిప్పు వచ్చిందని వార్త వచ్చింది. మీ అందర్నీ షిప్పులో అరబ్ కంట్రీస్‌కి రవాణా చేయటం ఖాయం! మాన ప్రాణాలు పరాయివాళ్ళకి తాకట్టు పెట్టుకునే కన్న ప్రాణాలు త్యాగం చెయ్యటమే మేలు! ధైర్యంగా ఎదుర్కొని పోరాడదాం. శత్రువుల్ని చంపలేకపోయిన పక్షంలో ఆత్మ త్యాగం చేద్దాం!" కౌసల్యలో ఉద్రేకం పొంగిపోయింది.

"అలాగే మేడం! మేము సిద్ధంగా వున్నాం!" అందరిలోను ఉత్తేజం ఉప్పెనలా ఉప్పొంగింది.

ఓ గంట తర్వాత నాయకుడు తిరిగొచ్చాడు.

అనుచరుల్ని పిలిచి మంతనాలాడాడు. మధ్య మధ్య కొన్ని మాటలు కౌసల్య వాళ్ళకు వినిపించాయి.

"సరుకు కొనుగోలుకి ఫారూక్ వస్తున్నాడు. ఈసారి మనకి బాగానే గిడుతుంది. సరుకు హేండోవర్ చేసి మనం కూడా యిక్కడ్నుంచి దుబాయి వెళ్ళిపోదాం!" అంటున్నాడు నాయకుడు ఉర్దూలో.

అనుచరులు "అచ్ఛాసాబ్" అన్నారు.

కౌసల్యకు మధ్య మధ్య కొన్ని మాటలు అర్థమయ్యాయి. వాళ్ళ మాటల్నిబట్టి వాళ్ళు కూడా విదేశీయులని, వాళ్ళలాంటి ముఠాలు కొన్ని అంతర్జాతీయ స్మగ్లింగ్ చేస్తున్నాయనీ, ముఖ్యంగా అమ్మాయిలను ఎగుమతి చేస్తున్నారనీ గ్రహించిందామె.

ఆమె పిడికిళ్ళు బిగుసుకున్నాయి. వీళ్ళను ఎలాగైనా ప్రభుత్వానికి అప్పచెప్పాలి. అది సాధ్యమా? ముందు తమకి వీళ్ళనుంచి తప్పించుకునే దారి కనిపించటంలేదు. వీళ్ళని ప్రభుత్వానికి పట్టించటం కూడానా....!

తన అవివేకానికి తనకే నవ్వొచ్చింది.

ఆమె ఆలోచనలు చెదిరిపోయాయి.

నాయకుడు మంతనాలు పూర్తిచేసి లేచాడు.

కాసేపట్లో తమని కొనుక్కోవటానికి ఆ ఫారూక్ ఎవడో వస్తాడు. తమని యీ రాక్షసుడు నిర్దాక్షిణ్యంగా వాళ్ళకు అమ్మేస్తాడు! ఆ తర్వాత తాము తప్పించుకునే దార్లు శాశ్వతంగా మూసుకుపోతాయి! త్వరపడాలి!

కౌసల్యకి మరో విషయం కూడా అర్థమయింది. తమ కోసం ఈ రాక్షసులు సింహపురిలో తాము బయల్దేరినప్పట్నుంచీ వేటాడుతూనే వున్నారు. బహుశా వీళ్ళే బంగళాముందున్న బస్ ఇంజన్ పాడుచేసి, వైర్లు రాంగ్ కనెక్షన్స్ యిచ్చారు. అయితే ఎందుకో తమని బంధించలేకపోయారు. బహుశా తమ బస్ ఆగిపోయిన ప్రదేశం వాళ్ళ స్థావరానికి దూరంగా వుండటం కారణం కావచ్చు! ఇప్పుడు తమ తిరుగు ప్రయాణంలో అందుకే తేలిగ్గా తమని బంధించగలిగారు.

కౌసల్యకి మబ్బు తెర విడిపోయింది.

కౌసల్య అటు యిటు చూసింది. యాదగిరి అనుచరుల దగ్గర్నుంచి లాక్కున్న రెండు తుపాకీల్లో ఒకటి కట కటాలకి పక్కనే పడుంది. మరో తుపాకీ యాదగిరి చేతుల్లోనే వుందింకా. బహుశా అందులో బుల్లెట్సు అయిపోయుంటాయి.

కౌసల్య దృష్టి తమకు సమీపంలో పడున్న తుపాకీ మీదనే వుంది! దాన్ని స్వాధీనం చేసుకోగలిగితే కొంత వరకు పరిస్థితి అదుపు చేయవచ్చు.

ఎవరూ చూడకుండా నెమ్మదిగా తుపాకీని కటకటాల గదిలోకి లాక్కుంది కౌసల్య.

ఆమెకు కొండంత ధైర్యం వచ్చింది.

నాయకుడు కౌసల్య వున్న గది దగ్గరకు గర్వంగా నడుస్తూ వచ్చి, "మిమ్మల్ని ఏం చెయ్యబోతున్నామని సస్పెన్స్‌లో వున్నారు కదూ మీరంతా! తెల్లారేసరికి మీకు బాగా తెలుస్తుంది. ఓ.కే....!?" అన్నాడు వికటంగా నవ్వుతూ.

కౌసల్య వచ్చిన అవకాశాన్ని వదులుకోలేదు. కిందనుంచి చటుక్కున తుపాకీ తీసుకుని అతనికి గురిచేసింది.

"కదలొద్దు. నాకు షూట్ చేయటం రాదనుకోకు. నా గురి తప్పదు. కాల్చడానికి వెనకాడను...." అన్నది కౌసల్య.

నాయకుడు విస్తుపోయాడు. అనుచరులు తుపాకులు కౌసల్యకు గురిచేయబోయేంతలో కౌసల్య అరిచి చెప్పింది. "నీ వాళ్ళని తుపాకులు కిందపడెయ్యమను, లేకపోతే నిన్ను కాల్చేస్తాను."

నాయకుడు అనుచరులకు సైగచేశాడు. వాళ్ళు ఆయుధాలు నేలమీద పడేశారు. అమ్మాయిలందరూ టెన్

షస్‌తో చూస్తున్నారు.

“వెంటనే మమ్మల్ని వదిలిపెట్టు. మేము మా బస్ చేరుకునేవరకు ఎలాంటి పిచ్చి వేషాలు వెయ్యొద్దు. నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాను” హెచ్చరించింది కౌసల్య.

నాయకుడి ఆదేశంమీద అనుచరులు రెండు కటకటాల గదుల తలుపులు తెరిచేశారు. బిలబిలమంటూ, అమ్మాయిలు గదుల బయటికి వచ్చేశారు. కొందరు వాళ్ళ దగ్గరున్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

“ఆ మూడో గది కూడా తెరవండి” ఆజ్ఞాపించింది కౌసల్య. వాళ్ళు మూడో కటకటాల గది కూడా తెరిచారు. అందులో బంధింపబడ్డ ఇరవైమంది అమ్మాయిలు బయటికొచ్చారు. కౌసల్య వంక కృతజ్ఞతగా చూశారు. వాళ్ళు వైజాగ్ నించి వస్తూండగా దొంగలు ఎత్తుకొచ్చి బంధించారట.

పరంధామయ్య, ఆ టెండర్లు, క్లీనరు అమ్మాయిల సాయంతో బంధాలు విప్పదీసుకుని, అదే తాడుతో దొంగల నాయకుడ్ని, అతని నలుగురు అనుచరుల్ని వెడరెక్కలు విరిచి కట్టేశారు.

నాయకుడు గుర్రుగా చూశాడు అందరివంకా. వైజాగ్ అమ్మాయిలు కౌసల్యకు, మిగతావారికి కృతజ్ఞతలు చెప్పుకుని, సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

కౌసల్య ప్రశంసగా చూసింది తన విద్యార్థినులవంక. దొంగల్ని నాయకుడితోబాటు బస్ యెక్కించేశారు. యాదగిరి స్థానం క్లీనర్ తీసుకున్నాడు. బస్ హైదరాబాదువైపు దూసుకుపోయింది.

—: సమాప్తం :—